
సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 28 । జనవరి । 2023



వైభవంగా మహా కుంభాభిషేకం

మైదుకూరులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. -8లో..



గెనిసిగడ్డ సాగు.. లాభాలు బాగు

ప్రస్తుతం గెనిసిగడ్డల సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. మార్కెట్‌లో కిలో రూ. 20 వరకు ధర పలుకుతున్నాయి. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.90	రూ.158

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 190 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	610	711
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 304.12 కిలోలు

న్యూస్‌రీల్

జంతు సంక్షేమం సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారిణి శారదమ్మ

సిద్దవటం: జంతు సంక్షేమం సామాజిక బాధ్యత అని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిణి శారదమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మండల కేంద్రమైన సిద్దవటంలోని జెడ్పీ హైస్కూల్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జంతు సంక్షేమ పక్షోత్సవాలు ఈనెల 30వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని జెడ్పీ హైస్కూల్‌లో 8,9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు జంతు సంక్షేమంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిచామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశామన్నారు . అంతకుముందు సిద్దవటం పశువుల ఆసుపత్రిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కడప డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ టి.వి.రమణ, సిద్దవటం ఏడీ డాక్టర్ సుబ్బరాయుడు, పశువైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందలూరు సబ్‌సెంటర్‌లో ఆస్ట్రోటర్ఫ్ ఏర్పాటు చేస్తాం



క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్/రాజంపేట: నందలూరులోని క్రికెట్ సబ్ సెంటర్‌కు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నూతనంగా ఆస్ట్రోటర్ఫ్‌ను ఏర్పాటు చేస్తామని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నందలూరు పట్టణంలోని క్రికెట్ సబ్ సెంటర్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో ఉత్తమ క్రీడాకారులను జిల్లాకు, రాష్ట్రానికి అందించిన ఘనత నందలూరు సబ్‌సెంటర్‌కు ఉందన్నారు. నందలూరుకు చెందిన పలువురు క్రీడాకారులు వివిధ వయో విభాగాల్లో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. ఇంత చక్కటి సబ్‌సెంటర్‌కు అదనంగా క్రికెట్ నెట్స్‌ను, మెటీరియల్‌ను అందజేస్తామని తెలిపారు. జిల్లా క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఖాజామైనుద్దీన్ మాట్లాడుతూ అండర్-12 నుంచి సీనియర్ విభాగం వరకు ప్రతి విభాగంలో జిల్లా నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించే జిల్లా క్రీడాకారుల సంఖ్య మరింత పెరగాలని ఆకాంక్షించారు. కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాల్లో ప్రతి శనివారం, ఆదివారం రెండురోజుల పాటు అండర్-12, 14, 16, 19 గ్రూప్ విభాగాల్లో లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రంజీ మాజీ క్రీడాకారుడు పైడికాల్వ విజయ్‌కుమార్ మాట్లాడుతూ బ్యాటింగ్, బౌలింగ్‌లోని నైపుణ్యాలను క్రీడాకారులకు వివరించారు. కార్యక్రమంలో సబ్‌సెంటర్ హెడ్‌కోచ్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్‌ఖాన్, ట్రైనర్ పి. శివకోటి తదితరులు పాల్గొన్నారు.

రెక్కాడితేనే కానీ డొక్కాడని బతుకులు.. పని చేస్తే కానీ నోటికందని మెతుకులు.. రెక్కల కష్టం చేద్దామన్నా స్థానికంగా దొరకని పనులు.. ఫలితంగా వందల కిలోమీటర్లు ప్రయాణించి వలసలు.. మధ్యప్రదేశ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వలస వస్తున్న కష్టజీవులపై కథనం.

- పొట్ట చేత పట్టుకుని వేల కిలోమీటర్ల పయనం
- వ్యవసాయ పనిముట్లు తయారీ
- ఏటా ఐదు నెలల పాటు ఇక్కడే సంచార జీవనం

కొలిమిలో కాల్చిన ఇనుమును సమ్మెటతో కొడవలి చేస్తున్న వలస కార్మికుడు



వలస జీవుల మెతుకు వేట

మదనపల్లె సిటీ: కొలిమిలో ఇనుమును కరిగించి.. రెక్కలు ముక్కలు చేసుకుంటూ వ్యవసాయ పనిముట్లు తయారు చేసి అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకోవడం... ఇదొక్కటే తరతరాలుగా వాళ్లకు తెలిసిన పని. అందుకే ఆ కుటుంబాల్లో పిల్లా పెద్దా..ఆడ,మగ ఇలా అందరికీ ఇనుముతోనే బతుకంతా ముడిపడి ఉంటుంది. ఒకరో ఇద్దరో కాదు ఏటా మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి సుమారు 5 వేల మంది నిరుపేదలు ఆంధ్రప్రదేశ్‌కు పొట్టచేత పట్టుకుని వస్తున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు. ఏటా వ్యవసాయ సీజన్‌లో ఐదు నెలలు పాటు ఇక్కడే ఉండి ఊరూరా తిరుగుతూ వ్యవసాయ పనిముట్లు తయారు చేసుకుంటూ, అమ్ముకుంటూ నాలుగు డబ్బులుల సంపాదించుకుని, తిరిగి సొంతూళ్లకు వెళుతుంటారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌కు చెందిన వలస కార్మికులు సుమారు 15 కుటుంబాలు ఇటీవల మదనపల్లెకు వచ్చారు. స్థానిక కదిరి రోడ్డులో రోడ్డుపక్కన గుడారాలు వేసుకున్నారు. బట్టీలు పెట్టుకుని వ్యవసాయ పనిముట్లు చేస్తున్నారు. పక్కనే తయారు చేసిన వాటిని అమ్మకాలకు పెట్టారు. దీంతోపాటు ఇంటిలోని కొందరు వాటిని పరిసర గ్రామాలకు తీసుకుని విక్రయిస్తున్నారు. వీరితో పాటు సమీపంలోని అంగళ్లు హైవేరోడ్డులో కొందరు వ్యవసాయ పనిముట్లు విక్రయిస్తున్నారు. ఇక్కడ దొరికే లారీల పాత క్లచ్ ప్లేట్లు కేజీ రూ.80కి కొంటారు. వాటతో గొడ్డళ్లు, కొడవళ్లు, పారలు, గునపాలు తదితర పనిముట్లు తయారు చేస్తారు. ఊరూరా తిరుగుతూ వాటిని విక్రయిస్తూ.. వచ్చిన డబ్బులతో పిల్లల్ని సాకుతున్నారు.



డొక్కాడాలంటే రెక్కాడాల్సిందే

యాంత్రీకరణ గణనీయంగా పెరిగిన ఈ రోజుల్లోనూ వారు చేతి వృత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నారు.ఉదయం 7 గంటలకు మొదలయ్యే పని రాత్రి 7 వరకు కొనసాగుతూనే ఉంటుంది. లారీల క్లచ్ ప్లేట్ల ను కొలిమిలో కాల్చి... ఇనుము కరిగించి సమ్మెట సాయంతో గునపాలు, పారలు వంటి పనిముట్లు తయారు చేస్తున్నారు. రోడ్డు పక్కనే నిప్పుల పొయ్యి రాజేసుకుని చపాతీలు, రోటీలు తయారు చేసుకుని తింటున్నారు. రాత్రయితే రోడ్ల పక్కనే గుడారాలు వేసుకుని నిద్రిస్తుంటారు. కొడవలి సైజును బట్టి రూ.50 నుంచి 200 వరకు, గొడ్డలి రూ.150 నుంచి రూ.300 వరకు, మాంసం కత్తి రూ.100 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు.

చిన్నప్పటి నుంచీ ఇదే పని



మా తల్లిదండ్రులు వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ ఈ పని మాకు అలవాటు చేశారు. మధ్యప్రదేశ్‌లో మా పనిముట్లుకు గిరాకీ ఉండదు. అందుకే జీవనోపాధి కోసం ఇక్కడికి వచ్చాం. బొగ్గుల ఖర్చులు,తినడానికి నిత్యావసర సరుకులు పోను రోజు రూ.400 వరకు సంపాదిస్తున్నాం.

-అభిషేక్, మధ్యప్రదేశ్

అక్కడ ఆదరణ లేదు




మధ్యప్రదేశ్‌లో పనిముట్లు తయారు చేసినా సరైనా బేరాలు ఉండవు. అందుకే వ్యవసాయ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వస్తాం. ఊరూరా తిరుగుతూ వ్యవసాయ పనిముట్లు విక్రయిస్తుంటాం. ఇక్కడైనా ఎంత కష్టపడినా చేతికొచ్చేది రోజుకు రూ.500 కూడా ఉండటం లేదు.

-ప్రేమ్‌బాయి, మధ్యప్రదేశ్

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

ఏపీ మోడల్ స్కూల్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ మోడల్ స్కూళ్ల స్టేట్ జాయింట్ డైరెక్టర్ ఎం వీ కృష్ణారెడ్డి

వల్లూరు: త్వరలో జరగనున్న పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఏపీ మోడల్ స్కూళ్లలోని విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి పాఠశాలల ప్రిన్సిపాళ్లు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ పాఠశాలల స్టేట్ జాయింట్ డైరెక్టర్ ఎం వీ కృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం గంగాయపల్లెలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని ఏపీ మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేయడం ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. మార్చి మాసంలో ఇంటర్ , పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా తీర్చి దిద్దాలని అన్నారు. వెనుక బడిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యా శాఖాధికారి దేవరాజు మాట్లాడుతూ పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించడానికి ప్రతి ప్రిన్సిపల్ చర్యలు చేపట్టాలని అన్నారు. ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యల గురించి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నారాయణ, అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లోని ఏపీ మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

గండికోట.. ప్రగతి బాట

- 'స్వదేశీ దర్శన్' పథకం కింద ఎంపిక
- నేడు ఒబెరాయ్ సంస్థ ప్రతినిధుల రాక

జమ్మలమడుగు/కడప కల్చరల్ : ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఇక్కడ అంతర్జాతీయ స్థాయి ఒబెరాయ్ ఇంటర్నేషనల్ స్టార్ హోటళ్ల సంస్థ తమ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ ప్రతినిధులు మరోసారి పరిశీలించటానికి శనివారం రానున్నారు. మొన్నటివరకు నిస్తేజంగా సాగిన గండికోట పర్యాటక అభివృద్ధి పనులు కొత్త ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఊపందుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో స్వదేశీ దర్శన్ కింద ఎంపిక చేసిన రెండు ప్రాంతాలలో ఒకటి గండికోట. దీని ద్వారా రూ.150 కోట్లతో వాచ్ టవర్లు, వసతి భవనాలు, పార్కులు ఇలా పర్యాటకులకు కావాల్సిన అన్ని ఆకర్షణలు కల్పించనున్నారు.

ఏర్పాట్లు చేస్తున్న రెవెన్యూ అధికారులు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేట్ భాగస్వామ్యంతో గండికోటను అభివృద్ధి చేయాలని సంకల్పించారు. దీంతో ఒబెరాయ్ సంస్థ రూ.250 కోట్లతో సెవెన్‌స్టార్ హోటల్‌తోపాటు స్టార్ సౌకర్యాలు గల 120 విల్లాలను ఏర్పాటు చేస్తామని చెప్పడంతో.. రాష్ట్ర ప్రభుత్వం 99 ఏళ్ల లీజుతో 50 ఎకరాల భూమిని కేటాయించింది. గతేడాది అక్టోబర్ 11న ఒబెరాయ్ హోటల్స్, రిసార్ట్స్ సీఈఓ అర్జున్‌సింగ్ ఒబెరాయ్, రాజమాన్ శంకర్, వినోద్ గోస్వామి గండికోటలోని కొట్టాలపల్లి, పెన్నానదిలోయ తదితర ప్రాంతాలను పరిశీలించారు. వారికి జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఆర్డీఓ జి.శ్రీనివాసులు దగ్గరుండి భూములను చూపించారు. మూడు నెలల తర్వాత తిరిగి ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు వస్తుండటంతో రెవెన్యూ అధికారులు గండికోట ప్రాంతానికి శుక్రవారం వెళ్లి వారికి కావాల్సిన ఏర్పాట్లను చూస్తున్నారు. శనివారం మధ్యాహ్నం తర్వాత వారు వస్తారని పర్యాటక, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు పేర్కొన్నారు.



గండికోట ప్రవేశ ద్వారం

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. నూత్న ఆలోచనలతో సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని చెప్పారు.మానవ మనుగడకు సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏపీజే అబ్దుల్‌కలాం, సర్ సీవీ రామన్, కల్పనాచావ్లా, సునీతావిలియమ్స్ తదితర మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మునిసిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ విద్యారంగానికి జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్య అంటే కేవలం మార్కుల సాధనే కాదని, జ్ఞానం, నూతన పరిశోధనల పట్ల జిజ్ఞాస పెంచుకోవటం అని అన్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అన్నమయ్య జిల్లానే మొదటగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మండలానికి ఐదు చొప్పున 30 మండలాల నుంచి 150 ప్రాజెక్టులు వచ్చాయన్నారు. వీటిలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు పంపనున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థుల ప్రాజెక్టులను డీఈఓ ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు ప్రాజెక్టుల విశేషాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్లు సుగవాసి ఈశ్వరప్రసాద్, సుగవాసి శ్యామ్, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘ ఛైర్మన్ శ్రీనివాసరాజు, స్కౌట్స్ జిల్లా సెక్రటరీ నర్సింహారెడ్డి, వైఎస్ఆర్‌టీఎఫ్ నేత రెడ్డప్పరెడ్డి, సాయి విద్యాసంస్థల డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు జావీద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి. చిత్రంలో డీఈఓ రాఘవరెడ్డి తదితరులు

కల్యాణ వైభోగమే !



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

ఘనంగా కడప రాయుని కల్యాణం

కడప కల్చరల్ : ఆ దివ్య మంగళమూర్తి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమలేశుని తొలిగడపగా పేరుగాంచిన, తిరుమలరాయుని ప్రతి రూపంగా భావిస్తున్న కడపరాయుని కల్యాణోత్సవాన్ని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని, కల్యాణ వేదికను రంగురంగుల పూలు, అరటి పిలకలతో అలంకరించారు. వేదికపై ఏర్పాటు చేసిన పెళ్లి పీటలపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. స్థానిక అర్చకులు మచ్చాశేషాచార్యులు, కృష్ణమోహన్, తివిక్రమ్, పలువురు సహాయక అర్చకులతో కలిసి శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు కప్పురపు పరిమళాల కడప రాయుని కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు ఆ ప్రాంగణానికి సమయానికి ముందే చేరుకున్నారు. స్వామి దివ్య మోహన రూపాన్ని తిలకించి ఆనంద పరవశులయ్యారు. మామిడి తోరణాలు ఈ కార్యక్రమానికి మరింత వన్నె కల్పించాయి. సమ్మోహన రూపంలో ధగధగలాడే నూతన వస్త్రాలతో వరుడిగా స్వామి కొలువుదీరగా, మరోవైపు ముగ్ధ మనోహర రూపాలతో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు వధువులుగా ఒదిగి కూర్చొన్నారు. మంచి గంధం ఇస్తున్న మధుర పరిమళం, మంగళ వాయిద్యాల సుస్వరాలు భక్తులను మైమరిపిస్తుండగా రెండు కళ్లు చాలవన్నట్లు కల్యాణ క్రతువును తిలకించారు.

శాస్త్రోక్తంగా..

కార్యక్రమంలో భాగంగా గణపతిపూజ, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, మాంగల్య పూజ, భక్తులకు మాంగల్య దర్శనం తదితర క్రతువుల అనంతరం అర్చకులు స్వామి పక్షాన అమ్మవార్ల గళసీమల్లో మంగళ సూత్రాలను అలంకరించారు. తలంబ్రాలు కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. అనంతరం లాజ హోమం నిర్వహించారు.ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు కల్యాణోత్సవాన్ని పర్యవేక్షించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు టంగుటూరి మారుతి ప్రసాద్ దంపతులు ప్రభుత్వ పక్షాన స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలను ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు. కల్యాణం పూర్తయ్యేవరకు ఉండి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల పక్షాన నిర్వాహకులు ముత్యాల తలంబ్రాలను సమర్పించగా, కల్యాణం అనంతరం తలంబ్రాలలో వాడిన అక్షతల కోసం భక్తులు పెద్ద ఎత్తున ఎగబడ్డారు. నిర్వాహకులు వారికి అక్షతలతో పాటు ముత్యాల తలంబ్రాలను కల్యాణ ప్రసాదంగా పంచి పెట్టారు. కల్యాణం అనంతరం ఆ మంగళ మూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి గజ వాహనంపై స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

31న అంగన్ వాడీ పోస్టులకు మౌఖిక పరీక్ష



ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి

రాయచోటి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల నియామకం కోసం మౌఖిక పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి తెలిపారు. జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 48 కార్యకర్తలు, 109 సహాయకులు, 11 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి నియామకాల కోసం వచ్చిన ధరఖాస్తులను పరిశీలించినట్లు చెప్పారు. అర్హత కలిగిన అభ్య ర్థులకు రెవెన్యూ డివిజన్‌ల వారీగా మౌఖిక పరీక్షల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 31వతేదీ ఉదయం 10గంటలకు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో.. మదనపల్లె డివిజన్‌లోని అభ్యర్థులకు, 1వతేదీ రాయచోటి రెవెన్యూడివిజన్ పరిధిలోని ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10గంటలకు మౌఖిక పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు.

క్లుప్తంగా

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

కలికిరి : బైక్‌ను ఆటో ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గుండ్లూరు గ్రామం గుంటివీరన్నపల్లికి చెందిన మోదీన్ సాహెబ్(75) తన ద్విచక్రవాహనంలో గురువారం సాయంత్రం మహల్ వైపు వెళుతుండగా కలికిరి–కలకడ మార్గంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధునికి తీవ్ర గాయాలు కావడంతో కలికిరి ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య అమీనాబీ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ కొండప్ప తెలిపారు.

వివాహిత బలవన్మరణం

మదనపల్లె : మదనపల్లె మండలంలో ఓ వివాహిత బలవన్మరణం చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సీటీఎం గ్రామం నాగులరాళ్ల వీధికి చెందిన సురేష్, గడ్డం రోజా (29)కు 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. చేనేత మగ్గం పని చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ క్రమంలో ఆమె నివసిస్తున్న ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భార్యాభర్తల మధ్య సమస్యలతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తాలూకా ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని మందలించడంతో ఘటన

మదనపల్లె : సెల్‌ఫోన్ వాడకం తగ్గించుకోవాలని తల్లిదండ్రులు మందలించినందుకు శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించారు. పట్టణంలోని నక్కలదిన్నె తండాకు చెందిన ఓ మైనర్ బాలిక (16) తండ్రి ఆటోడ్రైవర్‌గా జీవిస్తున్నాడు. ఆ బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే ఇటీవల ఇంటి పనులు సక్రమంగా చేయకపోవడం, సెల్‌ఫోన్‌లో అధిక సమయం గడుపుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన బాలిక పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అలాగే బి.కొత్తకోట మండలం బూర్లపల్లెకు చెందిన సురేంద్ర కుమార్తె (19) ఇంటర్ వరకు చదివి ఇంటి పట్టునే ఉంటోంది. తల్లిదండ్రులతో కలిసి కూలీ పనులకు వెళుతోంది. అయితే ఇటీవల సెల్‌ఫోన్‌తో ఎక్కువ సమయం గడుపుతుండటంతో గురువారం రాత్రి తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆ యువతి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పక్షుల అందాలు.. కిలకిలా రావాలు



ఎత్తయిన కొండలు.. కనుచూపు మేర పరుచుకున్న పచ్చదనం.. చల్లని వాతావరణం.. చుట్టూ పచ్చని చెట్లు.. కరెంటు తీగలపై వ రుస కట్టిన పక్షులు.. కిలకిలా రావాలు.. ఈ అందాలు కడప నగర శివారులోని సిద్దవటం మండలం మాచుపల్లె పొలాల్లో నెలవైనాయి. ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తోంది. తెల్లవారుజామున మంచు కురుస్తున్న వేళ.. మరింత రమణీయంగా కనిపిస్తోంది. మనస్సుకు ఆహ్లాదం, ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి.

– ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప

చేనుకు చీర.. రైతుకు రక్ష



రైల్వేకోడూరు మండలం బొజ్జవారిపల్లిలో చేను చుట్టూ కట్టిన చీరలు

పంటలు కాపాడుకోవడానికి రైతులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. చేనుకు కంచెగా చీరలు ఉపయోగిస్తున్నారు. రైల్వేకోడూరు ప్రాంతంలో పొలాలు అడవులకు సమీపంలో ఉండటంతో అడవి పందులు రాత్రి పూట దాడులు చేస్తున్నాయి. దీంతో రైతులు పాత చీరలు పొలాల చుట్టూ కట్టారు. అవి గాలికి కదులుతూ, రంగు రంగులుగా కనిపిస్తుండటంతో.. ఎవరో ఉన్నారని భావించి రావడం లేదని రైతులు తెలుపుతున్నారు.

– రైల్వేకోడూరు అర్బన్

గెనిసిగడ్డల సాగు.. లాభాలు బాగు



పొలంలో మడకలతో దున్ని గెనిసిగడ్డలను బయటకు తీస్తున్న దృశ్యం



గెనిసిగడ్డల కుప్ప

- కిలో ధర రూ.20
- తక్కువ పెట్టుబడి
- బయటి రాష్ట్రాల్లో మంచి డిమాండ్

గుర్రంకొండ : ప్రస్తుతం గెనిసిగడ్డల సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. టమాట, కూరగాయలు, పూల సాగు కంటే ప్రస్తుతం రైతులకు లభాలు తెచ్చిపెడుతున్న ఏకైక పంట గెనిసిగడ్డలు. మార్కెట్‌లో కిలో రూ. 20 వరకు ధర పలుకుతున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఈ పంట సాగులో కనిపిస్తున్నాయి. జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో సాగు చేసిన గెనిసిగడ్డలకు బయట రాష్ట్రాల్లోని మార్కెట్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. వాహనాల కోసం వినియోగించే గ్రీసు తయారీ కోసం ఈ గడ్డలను ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు ఎగుమతి చేసుకొంటున్నారు. దీంతో గెనిసిగడ్డల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

జిల్లాలో 2500 ఎకరాల్లో సాగు

జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు 2500 ఎకరాలు ఈ ఏడాది గెనిసిగడ్డల సాగు చేపట్టారు. ఈ పంట సాగుకు రబీ సీజన్ ఎంతో అనుకూలం. ప్రస్తుతం కోతలు కోస్తున్నారు. సాధారణంగా అక్టోబర్ నుంచి జనవరి వరకు సాగు ఉంటుంది. దుక్కుల దగ్గర నుంచి తీగెలు నాటడం, ఎరువులు, కూలీలు, పంట చేతికొచ్చే వరకు ఎకరాకు సాగు ఖర్చు రూ.50 వేల లోపే ఉంటుంది. చీడపీడలు, రసాయనిక ఎరువుల వాడకం ఖర్చులు తక్కువగా ఉంటాయి. కూలీల అవసరం ఎక్కువగా ఉండదు. మొదట తీగెలు నాటే సమయంలోనూ, ఆ తరువాత పంట అదనుకొచ్చిన తరువాత పొలంలో నుంచి గడ్డలు తవ్వి బయటకు తీసేందుకు మాత్రమే కూలీల అవసరం ఉంటుంది. పంట సాగుకు పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉన్న పంట ఇదే కావడం విశేషం.

మంచి దిగుబడి

గెనిసిగడ్డల సాగు సాధారణంగా మంచి దిగుబడిని ఇస్తుంది. ఎకరం పంటకు 7 టన్నుల నుంచి 9 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. వీటిని గోనెసంచుల్లో నింపి మార్కెట్లకు తరలిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.16 నుంచి రూ. 20 వరకు పలుకుతున్నాయి. మొదటి రకం గడ్డలు కిలో ధర రూ.20, రెండవ రకం రూ.18, మూడవ రకం కిలో రూ.16 వరకు ఉన్నాయి. ఈ లెక్కన ఎకరాకు రూ.1.40 లక్షల నుంచి 1.80 లక్షలు వరకు ఆదాయం వస్తోంది. పంట సాగు, పెట్టుబడి ఖర్చు పోనూ సరాసరి ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. గెనిసిగడ్డల తీగెలు పాడి ఆవులకు పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతాయి. అంతే కాకుండా గెనిసితీగెలను విత్తనపు తీగెలుగా అమ్ముకోవడం ద్వారా మరింత ఆదాయం వస్తోంది.

బయటి రాష్ట్రాలకు తరలింపు

జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో సాగు అయ్యే గెనిసిగడ్డలకు బయటి రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ గడ్డలను బెంగళూరు, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ మార్కెట్లకు తరలిస్తున్నారు. మనరాష్ట్రంలోని కడప, తిరుపతి, గుంటూరు, విజయవాడ పట్టణాల్లోని మార్కెట్లకు తరలిస్తుంటారు. బయట రాష్ట్రాల నుంచి కొంత మంది వ్యాపారులు ఇక్కడికి వచ్చి పొలాల దగ్గరే రైతుల నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఈ సీజన్‌లో బయట రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఎక్కువగా వస్తుంటారు.

గ్రీసు తయారీలో వినియోగం

గెనిసిగడ్డలను బయట రాష్ట్రాల్లో గ్రీసు తయారీలో ఎక్కువగా వినియోగిస్తుంటారు. బయట రాష్ట్రాల్లోని మార్కెట్లలో గెనిసిగడ్డలను తినడానికి ఉపయోగించడంతోపాటు గ్రీసు తయారీకి గానూ ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. అన్ని రకాల వాహనాలకు అవసరమైన అన్ని రకాల గ్రీసు తయారీలో వీటిని వినియోగిస్తుండడం గమనార్హం. దీంతో పలు రాష్ట్రాలకు చెందిన ఫ్యాక్టరీ యాజమానులు వ్యాపారుల ద్వారా గెనిసిగడ్డలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో వీటికి బయట రాష్ట్రాల మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది.

మూడు ఎకరాల్లో సాగు చేశా



మూడు ఎకరాల పొలంలో ఈ ఏడాది గెనిసిగడ్డల సాగు చేశాను. ఎకరానికి రూ. 50 వేలు లోపే సాగు ఖర్చు వచ్చింది. మిగిలిన పంటలతో పోల్చితే ఈ పంట సాగుకు పెట్టుబడి ఖర్చు చాలా తక్కువ. మార్కెట్లో ప్రస్తుతం కిలో గెనిసిగడ్డల ధర రూ. 16 నుంచి రూ.18 వరకు పలుకుతున్నాయి. దిగుబడి తగ్గినా ధరలు ఆశాజనకంగా ఉండడంతో నష్టాలు రాలేదు.

– దినేష్, రైతు, క్రిష్టాపురం

నిలకడైన ఆదాయం



ఈ ఏడాది గెనిసిగడ్డలు ఒక ఎకరంలో సాగు చేశాను. ప్రస్తుతం టమాట, కూరగాయల సాగు కంటే గెనిసగడ్డలు సాగు ఆదుకొంది. అన్ని ఖర్చులు పోను ఎకరానికి రూ.1.30 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది తమిళనాడు రాష్ట్రానికి ఎగుమతి చేశాము. అక్కడి మార్కెట్లో మంచి ధరలు ఉన్నాయి. ఇలా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడం వల్ల రైతులు బాగు పడే అవకాశముంది.

– రమణయ్య, రైతు, కంపల్లె

వ్యభిచార గృహంపై దాడి

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నె సమీపంలో నివాస గృహాల మధ్య గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న ఓ వ్యభిచార గృహంపై పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. ఇందులో ఇద్దరు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ వివరాలను ఎస్ఐ హరిహరప్రసాద్ శుక్రవారం వెల్లడించారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరుకు చెందిన శోభా (40) అనే వివాహిత శుక్రవారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. గత కొద్ది నెలలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఉండేదని, జీవితంపై విరక్తి చెందడంతో పాటు మతిస్థిమితం కోల్పోయిందని కుటుంబీకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆవులు మేపడానికి వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు బావి వాద్ద జారి పడి మృతి చెందిందన్నారు. సమాచారం అందుకున్న ములకలచెరువు ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నేడు అత్తిరాలలో వేలం

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ క్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 11 సమయంలో టెంకాయల విక్రయ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ కొండారెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం తెలియజేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని 2023–2024 సంవత్సరానికి ఈ వేలం పాటను నిర్వహించనున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

– ఇద్దరు మహిళలకు గాయాలు

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని ఆర్‌టీఏ కార్యాలయం ఎదురుగా శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. కమ్మవారిపల్లికి చెందిన సుహాసిని, సంధ్య అనే ఇద్దరు వలంటీర్లు కడప నగరంలో సొంత పనులు ముగించుకుని తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో వారిద్దరూ గాయపడటంతో రిమ్స్‌కు తరలించారు.

యూత్ పార్లమెంట్ ఎంపికలకు చక్కటి స్పందన



కాంపిటీషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఇన్‌సెట్) వర్చువల్ విధానంలో పోటీల్లో పాల్గొన్న యువతి

కడప స్పోర్ట్స్ : కడప నగరం బాలాజీనగర్‌లోని యూత్ హాస్టల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కాంపిటీషన్‌కు యువత నుంచి చక్కటి స్పందన లభించింది. వర్చువల్ విధానంలో నిర్వహించి ఈ పోటీలను నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన యువతకు పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతేడాది జిల్లాకు చెందిన మిద్దె రూప జాతీయ స్థాయిలో రాణించి పార్లమెంట్‌లో ప్రసంగించిన విషయం గుర్తుచేశారు. అనంతరం ఎంపికలు నిర్వహించి త్వరలో అనంతపురంలో నిర్వహించనున్న రీజినల్ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీల్లో పాల్గొనే 10 యువతతో కూడిన జిల్లా జట్టును ప్రకటించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా.జి.విజయలక్ష్మి, శ్రావణి వ్యవహరించారు.

రీజినల్ స్థాయికి ఎంపికైన వారు : ఎస్.ఆయేషా, అమీషానాజ్, యశ్వంత్‌రెడ్డి, ఎస్. సానియ, డి.సృజన, ఎస్.అమీనా, ఎస్.వైష్ణవి, పి.రాజశేఖర్, జె.పి.సంజన, ఎస్.అర్షియఅహ్మద్.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ పరీక్షా ఫలితాలు విడుదల

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ విభాగాలకు సంబంధించిన ఫలితాలను విశ్వవిద్యాలయ అధికారులు విడుదల చేశారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఆర్21 ప్రథమ సెమిస్టర్, ఆర్20 రెండవ సెమిస్టర్, ఆర్20 మూడవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య పి.ఫజుల్ రెహమాన్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి స్క్రీన్‌పై విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విద్యార్థులు 73 శాతం ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ఏఎఫ్‌యూ డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్, పరీక్షల నియంత్రణ సహాయ అధికారులు పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాలు అరికట్టడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరేట్ ఓఎస్‌డీ రఘునాథ్

కడప సిటీ : మాతృ, శిశు మరణాలు అరికట్టడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టరేట్ ఓఎస్‌డీ రఘునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లా స్థాయి ప్రసూతి (మాతృ), మరణాల విచారణ, బాధ్యత (ఎండీఎస్‌ఆర్) కమిటీ సమీక్షా సమావేశం ఓఎస్‌డీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ నాగరాజు, రిమ్స్ జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి మరణాల రేటును జీరో శాతానికి తీసుకు వచ్చేందుకు సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా, అంకిత భావంతో పని చేయాలన్నారు. 'జన్మనిస్తూ ఏ తల్లీ మరణించకూడదు, జన్మిస్తూ ఏ శిశువు మరణించకూడదు' అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్, అదనపు డీఎంహెచ్‌ఓలు ఖాదర్‌వలీ, ఉమామహేశ్వర్, 108 జిల్లా కో ఆర్డినేటర్ నాగరాజు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

రామయ్య సేవకు 'గోటి తలంబ్రాలు'



గోటి తలంబ్రాలకు వడ్లను స్వీకరిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి చివరి వారంలో జరగనున్న విషయం తెలిసిందే. భద్రాచలంలో లాగా ఈ ఆలయంలో కూడా వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులు గోటితో వలిచిన వడ్ల నుంచి సేకరించిన బియ్యాన్ని స్వామి సేవకు తలంబ్రాలుగా వినియోగించనున్నారు. వసంత పంచమి సందర్భంగా కడప నగరంలోని పలువురు భక్తులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ధర్మ ప్రచార పరిషత్, విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు కడపకు చెందిన బెస్త వేముల రామమహేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జిల్లాలోని పలువురు మహిళా భక్తులు, పెద్దలు కోటి తలంబ్రాల తయారీ కార్యక్రమంలో తమకు కూడా భాగస్వాములయ్యే భాగ్యం కల్పించాలని కోరుతున్నారు. స్పందించిన రామమహేష్ ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల కల్యాణోత్సవం (ఏప్రిల్ 5) రోజున గోటి తలంబ్రాలను వాడేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పాల్గొనదలిచిన వారికి తాము వడ్లు సరఫరా చేస్తామని, దీనికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. భగవంతుని సేవ చేసుకోవడం మాత్రమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఒక ప్యాకెట్‌లో 100–120 గ్రాముల వడ్లు మాత్రమే ఉంటాయని, భక్తులు ఎన్ని వడ్లయినా వలచవచ్చని తెలిపారు. వడ్లు కావాల్సిన వారు 97045 20511 లేదా 99632 50948 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా మహా కుంభాభిషేకం

చండీ హోమం నిర్వహించిన హంపి పీఠాధిపతి శ్రీవిరూపాక్ష విద్యారణ్యస్వామి



మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న హంపి పీఠాధిపతి శ్రీవిరూపాక్ష విద్యారణ్యస్వామి

మైదుకూరు : మైదుకూరులోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆరు రోజులుగా నిర్వహించిన మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరి రోజు శుక్రవారం ఆలయంలో హంపి పీఠాధిపతి శ్రీవిరూపాక్ష విద్యారణ్యస్వామి కుంభాభిషేకం, చండీ హోమం నిర్వహించారు. ఆదివారం నుంచి ప్రారంభమైన మహా కుంభాభిషేక ఉత్సవాల్లో గోపూజ, గణపతి పూజ, మాతృకపూజలతోపాటు ప్రతి రోజూ చండీ హోమం, చతుర్వేద పారాయణం నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి కలశాల్లో ఐదు నదుల పవిత్ర జలాలను ఉంచి హోమాలు నిర్వహించారు. హంపి పీఠాధిపతి శ్రీవిరూపాక్ష విద్యారణ్యస్వామి ఆలయ గర్భగుడిపైన మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం చండీ హోమం చేసి, కలశాల్లోని పంచనదీ జలాలను భక్తులపై చల్లి స్వాంతన చేకూర్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు సూరిశెట్టి శివవెంకట ప్రసాద్, శ్రీశైలం బోర్డు సభ్యురాలు సూరిశెట్టి మాధవిలత, ఆర్యవైశ్యసభ కార్యవర్గం యలవలి హరికిషన్, దరిశా సునీల్, దొంతు వెంకటసుబ్బయ్య, ఎలిశెట్టి ప్రసాద్, మిట్టా సురేష్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మాలేపాటి పద్మజ, ఉపాధ్యక్షులు రమాదేవి, శ్రీవాణి, ప్రధాన కార్యదర్శి బి.లత తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మవారి గ్రామోత్సవం

మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి మైదుకూరులో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా పేలుళ్లు, కోలాటం, కూచిపూడి నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. చెక్క భజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్యవైశ్యసభ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న జేసీ

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. నగర వనం, గరండాల్ బ్రిడ్జి, స్పోర్ట్స్ కాంప్లెక్స్, వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేపడుతూ సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.